సాక్షి
అనంతపురం
బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



'గురుకులం'.. భవిత పదిలం

నిరుపేద పిల్లల బంగారు భవిష్యత్తుకు గురుకుల పాఠశాలలు బాటలు వేస్తున్నాయి.

8లో



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.5°/16.7°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో చలి వాతావరణం కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

శేష వాహనంపై కొండమీద రాయుడు



బుక్కరాయసముద్రం: బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం కొండమీద రాయుడు శేష వాహనంపై ఊరేగారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఊరేగింపు చేపట్టారు. మహిళలు శ్రీవారికి మంగళ హారతులు పట్టారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. బుధవారం స్వామికి హనుమద్వాహనం సేవ ఉంటుంది.

భగభగలు పెరుగుతాయ్!

బుక్కరాయసముద్రం: జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని రేకులకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వాతావరణ కేంద్రం నుంచి సమాచారం అందిందన్నారు.పగటి ఉష్ణోగ్రతలు 37-38, రాత్రి ఉష్ణోగ్రతలు 20.5-22.6 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కావొచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 58-65 శాతం, మధ్యాహ్నం 23-27 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

బైకుల దొంగలకు జైలు



అనంతపురం: ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో ఇద్దరికి చెరో ఏడాది జైలు శిక్ష విధిస్తూ అనంతపురం జేఎఫ్‌సీఎం స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ జే. సుజిన్ కుమార్ తీర్పు వెలువరించారు. వివరాలు.. అనంతపురంలోని ప్రియాంక నగర్‌కు చెందిన సద్దాం హుస్సేన్, గార్లదిన్నె మండలం పెనకచర్ల గ్రామానికి చెందిన రాజశేఖర్‌లు బుక్కరాయసముద్రం మండల పరిధిలో గత ఏడాది ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడ్డారు. దీనిపై బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి ఎస్‌ఐ పి. వెంకటేశ్వర్లు దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీటు దాఖలు చేశారు. మేజిస్ట్రేట్ జే. సుజిన్ కుమార్ విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు మంగళవారం ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా దర్యాప్తు అధికారి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఏపీపీ హేమలత, కోర్టు కానిస్టేబుల్ రమణను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

అధికారుల తీరుపై డీఈఓ మండిపాటు



ఎంఈఓ సాయికృష్ణను నిలదీస్తున్న డీఈఓ

కూడేరు: మధ్యాహ్నం శిక్షణ తరగతులకు హాజరయ్యే ఉపాధ్యాయులంతా హాజరైనట్లుగా ముందస్తుగా ఎలా సంతకాలు తీసుకున్నారంటూ సంబంధిత అధికారులపై డీఈఓ వరలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. కాంప్లెక్స్ స్థాయిలో రాప్తాడు, కూడేరు మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను పరిశీలించారు. ఉపాధ్యాయులు హాజరైనట్టుగా సంతకాలు పెట్టి ఉండడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. శిక్షణా తరగతులను ఎంఈఓ-1, 2 పర్యవేక్షిస్తున్నారా? లేదా అంటూ అక్కడే ఉన్న కాంప్లెక్స్ చైర్మన్ శ్రీదేవిని ప్రశ్నించారు. ఇదే అంశంపై ఎంఈఓ-1 చంద్రశేఖర్ ఫోన్‌లో వివరణ ఇస్తూ తనను గ్రూప్-2 పరీక్షల డ్యూటీకి వేసినట్లు తెలిపారు. ఎంఈఓ-2 సాయికృష్ణతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. కొద్ది సేపటి తర్వాత అక్కడకు చేరుకున్న సాయికృష్ణపై తీవ్ర స్థాయిలో ఆమె మండిపడ్డారు. పర్యవేక్షణ చేయాల్సిన తీరు ఇదేనా అంటూ ప్రశ్నించారు. అనంతపురం 10వ తరగతి విద్యార్థులతో సమావేశమై ఇంగ్లిష్ పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. ప్రతి సబ్జెక్ట్‌పై మక్కువ పెంచుకుని అత్యధిక మార్కులు సాధించాలని సూచించారు. పరిసరాలు పరిశీలించి పారిశుద్ధ్యం మెరుగు పరచాలని హెచ్‌ఎం శ్రీదేవిని ఆదేశించారు. అనంతరం ఎమ్మార్సీ సెంటర్ పరిశీలించారు.

ఎన్నికల కసరత్తు ముమ్మరం

- బిజీబిజీగా అధికార యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి
- అవసరమైతే అదనంగా కేంద్రాలు
- ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా చర్యలు



తాడిపత్రి పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఎన్నికల స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుండగా.. ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. ఎన్నికలను అత్యంత పకడ్బందీగా నిర్వహించడంతో పాటు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడంలో తలమునకలవుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, ఫర్నీచర్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు సమకూర్చడంలో బిజీబిజీగా గడుపుతున్నారు.

3,774 పోలింగ్ స్టేషన్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 3,774 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. అనంతపురం జిల్లాలో 2,213, శ్రీ సత్యసాయి జిల్లాలో 1,561 ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో సౌకర్యాలు ఉన్నాయా లేదా అధికారులు పరిశీలిస్తున్నారు. 95 శాతం కేంద్రాల్లో అన్ని వసతులు ఉన్నట్లు ఇప్పటికే గుర్తించారు. మిగిలిన వాటిల్లో వసతులు కల్పించాలని తహసీల్దార్లకు రెండు జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.

అవసరమైతే అదనపు పోలింగ్ స్టేషన్లు

ఏదైనా పోలింగ్ కేంద్రం పరిధిలో 1,500 ఓట్లకు మించి ఉంటే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో ఆమేరకు చర్యలు తీసుకుంటున్నారు. ఫారం - 6,8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. ఫారం- 7 క్లెయిములపై విచారణ వారంలో పూర్తి చేయనున్నారు. ఒకవైపు ఏర్పాట్లు చేస్తూనే.. మరోవైపు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై విస్తృతంగా చైతన్యం కల్పిస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను పోలీసు అధికారుల ద్వారా సేకరిస్తున్నారు.

కలెక్టర్ నిత్యం సమీక్షలు..

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ గౌతమి నిత్యం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. 100 శాతం ఓటింగ్ సాధనే లక్ష్యంగా దిశానిర్దేశం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలోనూ పర్యటిస్తూ సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు. ఈవీఎంలు భద్రపరిచే జేఎన్‌టీయూ కళాశాలను ఇప్పటికే సందర్శించారు. ఏర్పాట్లు, భద్రతపై ఆదేశాలిచ్చారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ గౌతమి మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూములను తనిఖీ చేశారు. సౌకర్యాలపై ప్రిన్సిపాల్ నారాయణస్వామితో ఆరా తీశారు. అనంతరం శ్రీనివాసపురంలోని ట్రిబుల్ ఎస్ పాఠశాల, సుంకులమ్మపాలెంలోని చర్చి స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామభూపాల్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ గంగయ్య, కమిషనర్ జి.రవి, తహసీల్దార్ ఆంజనేయులు, సీఐలు మురళీకృష్ణ, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ షేక్ గౌస్‌బాషా, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. నియోజకవర్గాల వారీగా నామినేషన్, ఐటీ, కౌంటింగ్ బృందాలను నియమిస్తున్నాం. కొత్తగా వచ్చిన రిటర్నింగ్ అధికారులకు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించాం. కేంద్రాల్లో విద్యుత్తు, మంచినీరు, ర్యాంప్ తదితర వసతులు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో అధికారులు సమావేశం నిర్వహిస్తున్నారు. వారి నుంచి అందే ఫిర్యాదులకు తక్షణమే పరిష్కారం చూపుతున్నారు.

– గౌతమి, కలెక్టర్

జిల్లా వివరాలిలా...	
మొత్తం ఓటర్లు	19,94,544
పోలింగ్ కేంద్రాలు	2,213
ఫర్నీచర్ సౌకర్యం ఉన్నవి	2,179
విద్యుత్తు సౌకర్యం	2,199
ర్యాంప్ సౌకర్యం	2,164
మరుగుదొడ్ల సౌకర్యం	2,184
తాగునీటి సౌకర్యం	2,186
శ్రీ సత్యసాయి జిల్లాలో	
మొత్తం ఓటర్లు	13,91,628
పోలింగ్ కేంద్రాలు	1,561
ఫర్నీచర్ సౌకర్యం ఉన్నవి	1,561
కరెంటు సౌకర్యం	1,561
ర్యాంప్ సౌకర్యం	1,560
మరుగుదొడ్ల సౌకర్యం	1,557

ఎన్నికల టీంలు అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన టీంలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం. గౌతమి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మంగళవారం ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా టీంలు ఏర్పాటు చేశామన్నారు. స్టాటిస్టిక్స్ సర్వేలెన్స్ టీం, వీడియో సర్వేలెన్స్ టీం, వీడియో వ్యూవింగ్ టీం, ఎఫ్‌ఎస్టీ, ఎంసీసీ టీం అధికారులు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పూర్తయ్యాక, ఆర్వో స్థాయిలో మరో సారి మార్చి మొదటి వారంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎక్కడా చిన్న సమస్య కూడా తలెత్తకుండా చూసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి తగ్గట్టుగా అధికారుల్లో కూడా మార్పు రావాలన్నారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు, ఇతర వస్తువులు అక్రమంగా రవాణా కాకుండా ఐటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా,స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదును ఎక్కడి నుంచైనా నమోదు చేయవచ్చన్నారు. ప్రతి ఫిర్యాదుపై బాధ్యతగా విచారణ చేపట్టాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక రకరకాల ఫిర్యాదులు వస్తుంటాయని, నామినేషన్లు పూర్తయ్యాక మరో రకం ఫిర్యాదులు వస్తుంటాయని వివరించారు. 2019 ఎన్నికలతో పోలిస్తే 2024 ఎన్నికలు అత్యంత సున్నితమైనవని పేర్కొన్నారు. ఏదైనా సందేహం ఉంటే సంబంధిత ఆర్వో దృష్టికి తీసుకురావాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగరాదన్నారు. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అధికారులు శిక్షణ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం సీ-విజిల్ యాప్‌పై సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి, డీఆర్‌ఓ జి. రామకృష్ణా రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఐ. నరసింహా రెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ అండ



మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని కలెక్టర్ ఎం.గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్ బటన్ నొక్కి 'కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా' లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ జిల్లాలో 523 మందికి రూ.3.97 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు కింద ఎస్సీ వర్గానికి చెందిన 141 మందికి (ముగ్గురు కులాంతర వివాహం) రూ.1.41 కోట్లు, ఎస్టీ వర్గానికి చెందిన 14 మందికి రూ.14 లక్షల లబ్ధి చేకూరిందన్నారు. బీసీ వర్గానికి చెందిన 261 మందికి (ముగ్గురు కులాంతర వివాహం) రూ.1,32,75,000 జమ చేశారన్నారు. మైనారిటీ వర్గానికి చెందిన 91 మందికి (ఇద్దరు కులాంతర వివాహం) రూ.93.40 లక్షలు జమ చేశారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బీసీ వర్గాలకు రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకుంటే రూ.75 వేలు, మైనారిటీలకు రూ.లక్ష, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, భవన నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ బోర్డు కింద రూ.40 వేలు మంజూరు చేశారన్నారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి మెగా చెక్కు విడుదల చేశారు.

రూ. లక్ష అందింది



మా తల్లిదండ్రులు కూలి పనులతో జీవనం సాగిస్తూ మాకు పెళ్లి చేశారు. కల్యాణమస్తు కింద రూ.లక్ష ఆర్థిక సాయం అందించడం చాలా సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలుస్తున్నారు. ఆయనకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు.

-అపర్ణ, మనోహర, రోటరీపురం, బీకేఎస్ మండలం

రుణపడి ఉంటాం



మాది పేద కుటుంబం. నేను ఇంటర్ చేశా. నా భర్త డిగ్రీ చదివాడు. మా పెళ్లి ఖర్చులకు షాదీ తోఫా కింద రూ.లక్ష అందించారు. చదువులకు ఊతమిస్తూ ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయం. ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– నసీమా, చాంద్‌బాషా, పాతూరు

'సిద్ధం'తో ప్రతిపక్షాల బెంబేలు

- సీఎం వైఎస్ జగన్‌కు తగ్గని జనాదరణ
- ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, మాలగుండ్ల శంకర్‌నారాయణ



సంక్షేమ పథకాలపై మహిళకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకర్‌నారాయణ

అనంతపురం కార్పొరేషన్: 'సిద్ధం' సభలకు తరలి వస్తున్న ప్రజలను చూసి ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయని ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, మాలగుండ్ల శంకర్‌నారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని 40వ డివిజన్ ఆజాద్‌నగర్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్ సీపీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పార్లమెంట్ సమన్వయకర్త మాలగుండ్ల శంకర్‌నారాయణతో కలసి ఎమ్మెల్యే అనంత ప్రతి గడపకూ వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ నాయకత్వంపై ప్రజలకు అపారమైన విశ్వాసం ఉందన్నారు. 'సిద్ధం' సభలకు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ సభలకు జనం తరలివస్తున్నారన్నారు. ఆయన పాలనలో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేదలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ, బెంగళూరు, చెన్నైలాంటి ప్రాంతాల్లోనూ కార్పొరేట్ వైద్యం అందిస్తోందన్నారు.

మళ్లీ వైఎస్ జగనే సీఎం

ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ మాట్లాడుతూ 'ఇంటింటికీ వైఎస్సార్ సీపీ' కార్యక్రమాన్ని ప్రజలు సంతోషంగా స్వాగతిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకే ఓటు వేస్తామని చెబుతున్నారన్నారు. సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ఎన్నికవడం ఖాయమన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అనంతపురం నగరం అభివృద్ధికి నోచుకోలేదని, తమ ప్రభుత్వం వచ్చాక రూపురేఖలు మారిపోయాయన్నారు. ప్రధాన రోడ్లతో పాటు మారుమూల ప్రాంతాల్లోనూ రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాళ్లు, లైటింగ్ తదితర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇసాక్, సాకే చంద్ర, లీలావతి, అనిల్‌కుమార్ రెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్‌పీరా, సైఫుల్లాబేగ్, ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, రాధాకృష్ణ, మిద్దె నగేష్, లింగాల రమేష్, రామయ్య, మున్వర్, పసేద పురుషోత్తం, జావెద్, ఓబులేసు, పాల్గొన్నారు.

రేపటి నుంచి న్యాక్ కమిటీ పరిశీలన

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)కు గురువారం న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) పీర్ కమిటీ రానుంది. వర్సిటీకి గ్రేడింగ్ ఇచ్చే నిమిత్తం 3 రోజుల పాటు సందర్శించనుంది. జేఎన్‌టీయూ స్థాపించాక తొలిసారి న్యాక్ గ్రేడింగ్‌కు వెళ్తుండడం గమనార్హం. పీర్ కమిటీలో పి. సంగాణి, రాఘవ, జయంతి, సతీష్ పాల్, మంజునాథ సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు దక్కింది. ఈ క్రమంలోనే న్యాక్ గ్రేడింగ్ వచ్చేలా వర్సిటీ ఉన్నతాధికారులు కృషి చేశారు. న్యాక్ గుర్తింపు దక్కితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీల నుంచి గణనీయంగా నిధులు దక్కే అవకాశం ఉంటుంది. వర్సిటీ జారీ చేసే సర్టిఫికెట్‌కు మంచి గుర్తింపు లభిస్తుంది. కాగా, న్యాక్ పీర్ కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రమే జేఎన్‌టీయూ చేరుకుంటారని సమాచారం.

విద్యార్థీ వి'జయీభవ'!

- ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంపునకు 50 రోజుల ప్రత్యేక కార్యక్రమం
- ప్రతి విద్యార్థిపై అధ్యాపకుల వ్యక్తిగత శ్రద్ధ
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక గురి
- మంచి ఫలితం ఇస్తోందంటున్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు



అనంతపురంలోని కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులందరూ ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణతే లక్ష్యంగా 'జయీభవ' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అధ్యాపకులు ప్రత్యేకంగా ప్రణాళికలు తయారు చేసి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. గత నెల 10న ప్రారంభమైన కార్యక్రమం ఈనెల 28 వరకు కొనసాగుతుంది. ఇందుకు సంబంధించి ఇంటర్ బోర్డు కమిషనర్ సౌరబ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ

'జయీభవ' కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకుంటున్నారు. అంతర్గత, యూనిట్, త్రైమాసిక, అర్ధ సంవత్సర పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రేడింగ్ చేశారు. కేర్‌టేకర్ పద్ధతిలో ప్రతి 10 మంది విద్యార్థులను గ్రూపుగా తయారు చేశారు. బాగా చదువుతున్న విద్యార్థుల్లో ఒకరిని లీడరుగా నియమించారు. లీడర్లుగా ఉన్న వారు తక్కిన 9 మంది ప్రగతిని తరచూ బేరీజు వేసి ఎప్పటికప్పుడు అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలోనే వెనుకబడిన విద్యార్థులపై అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులందరినీ అధ్యాపకులకు కేటాయించి వ్యక్తిగతంగా పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.

చదువుకున్న వెంటనే పరీక్ష

రోజూ ఉదయం మొదటి, రెండు పీరియడ్లు గ్రూపు సబ్జెక్టులు, 3వ పీరియడ్ లాంగ్వేజ్, మధ్యాహ్నం ఒక గ్రూపు సబ్జెక్టు, మరొక లాంగ్వేజ్ సబ్జెక్టు చదివిస్తున్నారు. ప్రతి పీరియడ్‌లోనూ చివరి 20 నిమిషాలు పరీక్ష రాయిస్తున్నారు. చదువుకున్న అంశంపై ఎప్పటికప్పుడు పరీక్ష రాస్తే విద్యార్థులకు బాగా గుర్తుంటుందని అధ్యాపకులు చెబుతున్నారు. ఆయా సబ్జెక్టుల నిపుణులతో 2 మార్కులు, 4 మార్కులు, 8 మార్కులకు సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలను గుర్తించారు. వీటిపై విద్యార్థులకు తరచూ తర్ఫీదు ఇస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	23
ఎయిడెడ్	2
మొదటి సంవత్సరం విద్యార్థులు	5,603
ద్వితీయ సంవత్సర విద్యార్థులు	3,194

పిల్లలు బాగా చదువుతున్నారు

కళాశాలలో షెడ్యూలు ప్రకారం 'జయీభవ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. సిలబస్ పూర్తి కావడంతో రోజూ ఆయా పీరియడ్లలో చదివించి, వెంటనే పరీక్షలు రాయిస్తున్నాం. ముఖ్యమైన ప్రశ్నలు గుర్తించి చదివిస్తున్నాం. దీంతో పిల్లలు కూడా ఆసక్తిగా చదువుకుంటున్నారు. గతం కంటే కూడా ఫలితాలు మెరుగ్గా వచ్చే అవకాశం ఉంది.

– డొక్కా శంకరయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఆత్మకూరు

విజయవంతంగా అమలు

ఈసారి ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో మంచి ఫలితాల సాధనపై ఇంటర్ విద్య కమిషనర్ సౌరభ్‌గౌర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 'జయీభవ' 50 రోజుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 25 ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా అమలవుతోంది. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఈసారి కచ్చితంగా ఫలితాల శాతం పెరిగే అవకాశం ఉంది.

–వెంకటరమణనాయక్, ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్

క్లుప్తంగా

చెరకు తోట దగ్ధం


కాలిపోయిన చెరకు పంట

బొమ్మనహాళ్: ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో చెరకు తోట దగ్ధమైంది. వివరాలు.. బొమ్మనహాళ్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన రైతు మచ్చన్న ఆరు ఎకరాల్లో చెరకు పంట సాగు చేశారు. 2 ఎకరాల్లో చెరకు పంట గానుగ పూర్తయింది. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో నాలుగు ఎకరాల్లోని చెరకు తోటలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికుల సాయంతో మంటలు ఆర్పేందుకు మచ్చన్న, కుటుంబసభ్యులు విశ్వ ప్రయత్నం చేశారు. అయినా ఫలితం దక్కలేదు. ఘటనతో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించి, నివేదిక సిద్ధం చేశారు.

విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించండి

- రాష్ట్ర స్థాయి పరిశీలన బృందం అధికారి రాజేంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న రాజేంద్రనాథ్‌రెడ్డి

పామిడి: వెనుకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి పరిశీలన బృందం అధికారి రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. అభ్యసనా అభివృద్ధి కార్యక్రమం (లిప్)లో భాగంగా మంగళవారం పామిడిలోని తంగుటూరి చిన్నప్పశ్రేష్టి ప్రభుత్వ ఉన్నత పాఠశాల (టీసీజీహెచ్ఎస్)లో జరుగుతున్న శిక్షణా తరగతులను రాష్ట్ర పరిశీలన బృందం తనిఖీ చేసింది. లిప్ నిర్వహణతో పాటు తరగతిగదిలో బోధనాతీరును బృందం సభ్యులు గమనించారు. పాఠశాల సముదాయ సమావేశాలు, కార్యక్రమాల నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బృందానికి నేతృత్వం వహిస్తున్న రాజేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు సులభరీతిలో బోధన చేసే విధానంపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రాయచోటి డైట్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, డీఆర్పీ మాధవరెడ్డి, హెచ్ఎం కె.రామ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులం... భవిత పదిలం

- నాణ్యమైన విద్య, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలు
- 5 నుంచి పదో తరగతి వరకూ ఉచిత వసతి, విద్య
- జిల్లాలో మూడు బాలికలు, రెండు బాలుర గురుకులాలు
- 2024–25 విద్యా సంవత్సరం 5వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- మార్చి 1 నుంచి 31 వరకు దరఖాస్తుల స్వీకరణ... ఏప్రిల్ 27న రాత పరీక్ష

పేద, మధ్య తరగతి పిల్లలకు ఉచితంగా ఆంగ్లమాధ్యమంలో విద్యనందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన నిరుపేద పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల (ఎస్సీ, ఎస్టీ, బీసీ)తో పాటు మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.


వెస్ట్ నరసాపురం బాలికల గురుకుల పాఠశాల

అనంతపురం ఎడ్యుకేషన్: వెనుకబడిన తరగతుల విద్యార్థుల చదువుకు దన్నుగా నిలుస్తూ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. 'నాడు–నేడు' కార్యక్రమంతో మౌలిక వసతులు కల్పించారు. క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యాబోధన, రుచికరమైన భోజనం, ఆడపిల్లలకు పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తుండడంతో ఏడాదికేడాది సీట్ల భర్తీకి డిమాండ్ పెరుగుతోంది. ఒక సీటుకు 15 మంది చొప్పున విద్యార్థులు పోటీ పడుతున్నారు.

మూడు బాలికలు, రెండు బాలుర పాఠశాలలు

జిల్లాలో మూడు బాలికలు, రెండు బాలుర గురుకుల పాఠశాలలున్నాయి. శింగనమల నియోజకవర్గం నార్పల, రాయదుర్గం నియోజకవర్గం గోనబావి, డి.హీరేహాల్‌లో బాలికలు, కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి, ఉరవకొండ నియోజకవర్గం కొనకొండ్లలో బాలుర పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 1,678 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 928 మంది బాలికలు, 750 మంది బాలురు ఉన్నారు. ప్రతి పాఠశాలలోనూ సీసీ కెమరాల పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 5 గంటలకు నిద్ర లేచింది మొదలు రాత్రి 9 గంటల వరకూ విద్యార్థులపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటోంది. రాత్రి 9 నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకూ ఓ నర్సు, పీఈటీ, టీచర్, నైట్ వాచ్‌మన్ పర్యవేక్షణ ఉంటుంది.

నాణ్యమైన విద్య, బాలికలకు పూర్తి రక్షణ

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించేందుకు అమిత ఆసక్తి చూపుతున్నారు. గురుకులాల్లో ఎలాగైనా సీటు సంపాదించాలని తపనతో తమ పిల్లలను ప్రైవేటుగా ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తుండడం గమనార్హం. సీటు వస్తే 5 నుంచి పదో తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో విద్యతోపాటు ఉచితంగా భోజన, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. 5వ తరగతి నుంచే బ్రిడ్జి కోర్సు, ప్రాజెక్ట్ బేస్డ్ లర్నింగ్ వంటి అంశాలపై నిష్ణాతులైన టీచర్లు శిక్షణ ఇస్తున్నారు. 6, 7 తరగతుల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు నిర్వహిస్తూ వారిలోని నైపుణ్యాలను వెలికి తీస్తున్నారు. 8, 9 తరగతుల విద్యార్థులకు మైక్రో టెస్ట్, నెలవారీ పరీక్షలు, అసైన్‌మెంట్లు నిర్వహిస్తున్నారు. అంతేకాక ట్యాబ్‌ల ద్వారా బైజూస్ కంటెంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. 9వ తరగతి నుంచి ఆన్‌లైన్‌లో ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ ఇస్తున్నారు. 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా తర్ఫీదు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే పదో తరగతి విద్యార్థులకు ఇంటెన్సివ్, మైక్రోటెస్ట్, అసైన్‌మెంట్స్, గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. పిల్లల ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని ఆయా క్రీడల్లో రాణించేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారు.

రూ.83 కోట్లతో పక్కా భవన నిర్మాణాలు

గురుకుల పాఠశాల విద్యను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే స్థాయిలో గురుకులాలకు పక్కా భవనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో నార్పల పర్యటనకు వచ్చిన ఆయన అక్కడ నిర్వహిస్తున్న ఈస్ట్ నరసాపురం బాలికల గురుకుల పాఠశాల గురించి ఆరా తీశారు. ఈస్ట్ నరసాపురంలో పక్కా భవనం లేకపోవడంతో ఇక్కడ ఏర్పాటు చేసినట్లుగా తెలుసుకున్న ఆయన తక్షణమే పక్కా భవన నిర్మాణానికి రూ.35 కోట్లు కేటాయిస్తున్నట్లుగా ప్రకటించారు. కళ్యాణదుర్గం పర్యటనలోనూ కుందుర్పిలోని గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి రూ. 25 కోట్లు, ఉరవకొండ పర్యటనలో బాలికల పాఠశాల ఏర్పాటు, భవన నిర్మాణానికి రూ.33 కోట్లు కేటాయించారు. వీటికి సంబంధించి ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు.

5వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

2024–25 విద్యా సంవత్సరంలో మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. మార్చి 1 నుంచి 31వ తేదీ వరకూ https://mjpapbcwreis.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 27న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. కొనకొండ్ల బాలుర పాఠశాలలో పూర్తిస్థాయిలో వసతులు ఉండడంతో 80 సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన స్కూళ్లలో 40 సీట్ల చొప్పున భర్తీ చేయనున్నారు.

సీట్లకు డిమాండ్ పెరిగింది



నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తుండడంతో బీసీ గురుకుల పాఠశాలల్లో సీట్లకు డిమాండ్ పెరిగింది. ఒక్కో సీటుకు 15 మంది చొప్పున విద్యార్థులు పోటీ పడుతున్నారు. 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ వచ్చింది. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రతిభ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– సంగీతకుమారి, బీసీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్


సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న గురుకుల పాఠశాల విద్యార్థులు (ఫైల్)

జనవాక్కు

సొంతింటి కల నెరవేరుతోంది



మేము గుంతకల్లులోని 32వ వార్డు ప్రశాంత్‌నగర్‌లో ఓ అద్దె ఇంటిలో నివాసముంటున్నాం. మా ఆయన బాదెప్పగారి గోపాల్ కూలి పని చేయగా, నేను ఇళ్లలో పాచి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. కూతరు నాగమ్మను డిగ్రీ చదవిస్తున్నాం. పేదరికంతో జీవనం గడుపుతూ అద్దె కట్టలేని పరిస్థితిలో ఉన్నాం. మాకు సొంతిల్లు కట్టుకునే స్తోమత లేదు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలం కోసం అనేక సార్లు దరఖాస్తు చేసుకున్నా. మంజూరు కాలేదు. జగనన్న సీఎం అయ్యాక మాకు దోనిముక్కల రోడ్డులో ఇంటి స్థలంతోపాటు పక్కాగృహం మంజూరైంది. లెంటెల్ దశ పూర్తయ్యింది. త్వరలో ఇంటి నిర్మాణం పూర్తవుతుంది. సొంతింటి కల సాకారమవుతున్నందుకు జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

– దొడగట్ల మసక్క, గుంతకల్లు

జగనన్న సాయం మరువలేను



నేను చిత్తూరు జిల్లా పుత్తూరులో 2021 జూలైలో బీటెక్ పూర్తి చేశాను. సీఎం వైఎస్ జగనన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద రూ.37 వేలు, వసతి దీవెన కింద రూ.20 వేలు మంజూరు చేశారు. 2021 డిసెంబర్‌లో చెన్నైలోని అటాస్ సింటల్ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ కంపినీలో ఉద్యోగంలో చేరాను. నెలకు రూ.45 వేల జీతం వస్తోంది. రూ.15 వేలు ఖర్చులకు పెట్టుకుని మా తల్లి దండ్రులకు రూ.30 వేలు పంపిస్తున్నాను. ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు సీఎం వైఎస్ జగనన్న చేస్తున్న సహాయం మరువలేనిది.

– నిరంజన్‌రెడ్డి, గోవిందపల్లి, బుక్కరాయసముద్రం మండలం

రూ.8.50 లక్షల లబ్ధి చేకూరింది



వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న మాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.8.50 లక్షల లబ్ధి చేకూరింది. ఈ పథకాల లబ్ధి పొందేందుకు ఏ రాజకీయ నాయకుడినీ మేము సిఫారసు కోరలేదు. అధికారుల వద్దకూ వెళ్లింది లేదు. ఇంటి వద్దకు వలంటీర్ వచ్చి తగిన ఆధారాలు తీసుకెళ్లి పథకాలు దక్కేలా చేశాడు. ఇందు కోసం నయా పైసా ఖర్చు చేయలేదు. మా అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి చేకూర్చి, మా ఆర్థిక ఇబ్బందులు దూరం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మా మద్దతు.

– చిత్తమ్మ, నేత్రపల్లి, గుమ్మఘట్ట మండలం

ఫొటోగ్రాఫర్‌పై దాడి ఘటనలో ఒకరు అరెస్ట్

అనంతపురం: పత్రికా ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి ఘటనలో కూడేరు మండలం మరుట్ల–2 కాలనీకి చెందిన మిద్దె ఎర్రిస్వామిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. ఐపీసీ 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. దాడి చేసిన వారిలో ఇప్పటికే ఆరుగురిని గుర్తించామన్నారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి, వారి కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు.

చైతన్యంతోనే బడుగులకు రాజ్యాధికారం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు


మాట్లాడుతున్న కేసన శంకరరావు..చిత్రంలో రమేష్‌గౌడ్ తదితరులు

అనంతపురం సిటీ: జనాభా, ఓట్లపరంగా అత్యధికంగా ఉన్న బడుగు, బలహీన వర్గాల వారిలో రాజకీయ చైతన్యం వచ్చినప్పుడే రాజ్యాధికారాన్ని సాధించగలమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనంతపురం జెడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ నాగభూషణం, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్వారకా శీను ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శంకరరావు మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల వారందరూ ఐక్యతను చాటాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రమేష్ గౌడ్ మాట్లాడుతూ జెండా – అజెండా బీసీలదే అయి ఉండాలన్నదే తమ సంకల్పమన్నారు. బీసీలకు రాజ్యాధికారం అనేది మాటలకే పరిమితం కాకూడదని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలని కోరారు. మన ఆలోచనలో మార్పు వచ్చినప్పుడే లక్ష్యం దిశగా దూసుకుపోగలమన్నారు. దేశంలో ఏ విధంగా చూసుకున్నా బీసీల జనాభే ఎక్కువగా ఉందన్నారు. రాజకీయంగా ముందుకొచ్చే బీసీలకు మనమంతా అండగా నిలుద్దామన్నారు. సమావేశంలో బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సంపంగి గోవర్దన్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలను మరింత విస్తరించడమే లక్ష్యం

ప్రశాంతి నిలయం: సత్యసాయి వైద్య సేవలను మరింత విస్తరిస్తామని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పని చేస్తోందని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు పేర్కొన్నారు. తమిళనాడులోని కొయంబత్తూర్ కేంద్రంగా నూతనంగా ప్రారంభించిన సత్యసాయి మొబైల్ ఆస్పత్రి బస్సుకు మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు చేసి, మాట్లాడారు. గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ఏర్పాటు చేసిన మొబైల్ ఆస్పత్రులు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. ఈ క్రమంలో రాబోవు రోజుల్లో మరిన్ని రాష్ట్రాల్లో మొబైల్ ఆస్పత్రులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

కంబదూరు: జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు పర్యవేక్షణలో కంబదూరు ఎస్‌ఐ ఆంజనేయులు, జిల్లా స్పెషల్ పార్టీ సంయుక్తంగా మంగళవారం చేపట్టిన తనిఖీల్లో కర్తనపర్తి క్రాస్ వద్ద 1,872 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. కారులో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని సీజ్ చేశారు. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో నలుగురు పరారీ కాగా, తిప్పేపల్లికి చెందిన అనిల్ పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

క్షయ నివారణకు కృషి చేయాలి : డీఎంహెచ్‌ఓ

అనంతపురం మెడికల్: జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు అంకితభావంతో పని చేయాలని సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. జాతీయ క్షయవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న మందులను క్షయవ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వాడుతున్నారో లేదోనని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. వారిలో ఆత్మస్థైర్యం లోపించకుండా సూచనలు, సలహాలనందజేయాలన్నారు. క్షయ నివారణాధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ మాట్లాడుతూ... క్షయ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న పౌష్టికాహారం, డాట్ ప్రొవైడ్స్ తదితర సేవలపై ఆశ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

లోగో తయారీ పోటీల్లో పేరూరు విద్యార్థికి మూడో స్థానం


రాజమండ్రిలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నవదీప్

రామగిరి: మండలంలోని పేరూరు డ్యాంలో ఉన్న ఏపీఆర్ఎస్ (గురుకుల) బాలుర పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న నవదీప్ మంగళవారం రాజమండ్రిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే క్రమంలో చిక్కీని సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిక్కీ తయారీని ట్రూగుడ్ సంస్థ దక్కించుకోగా లోగో చిత్రీకరణ కోసం ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోని విద్యార్థులకు సంస్థ పోటీ నిర్వహించింది. ఈ పోటీల్లో పేరూరు డ్యాంలోని ఏపీఆర్ఎస్ విద్యార్థి నవదీప్ పాల్గొని, రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతిని దక్కించుకున్నాడు. ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు మంగళవారం రాజమండ్రి వేదికగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను మంత్రి చెల్లుబోయిన చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంజేపీ రాష్ట్ర పాఠశాలల సెక్రెటరీ కృష్ణమోహన్, పేరూరు ఏపీఆర్ఎస్ ఉపాధ్యాయుడు శ్రీరాములు పాల్గొన్నారు.

ఎస్కేయూకు రూ.20 కోట్ల నిధులు మంజూరు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి

అనంతపురం: పీఎం– ఉష పథకంలో భాగంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి రూ.20 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. మంగళవారం ఈ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా సెంట్రల్, స్టేట్ వర్సిటీల విద్యార్థులనుద్దేశించి వర్చువల్ విధానంలో మోదీ ప్రసంగించారు. అనంతపురంలోని ఎస్కేయూ నుంచి వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులనుద్దేశించి ఎస్కేయూ వీసీ డాక్టర్ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య మాట్లాడుతూ... పీఎం ఉషా పథకం కింద మంజూరైన నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో పీఎం ఉష ప్రోగ్రాం ఎస్కేయూ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ నాగరాజు, ప్రొఫెసర్ వి.రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించండి


సూచనలిస్తున్న స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కల్పనాసైలా

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కల్పనాసైలా సూచించారు. మంగళవారం బుక్కరాయసముద్రంలోని జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలల్లో సిబ్బంది, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వసుంధర, ఎస్ఎస్ఏ ఏఎంఓ చంద్రమోహన్‌రెడ్డి, టీఎం సభ్యులు విజయ్‌కుమార్‌డేవిడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



శేష వాహనంపై శ్రీవారు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం రాత్రి దేవేరులతో కలసి శేష వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడి ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై అధిష్టింపజేసి పురవీధుల మీదుగా గ్రామ శివారులోని జమ్మి చెట్టు వద్దకు చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం తిరిగి ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. బుధవారం హనుమద్ వాహనోత్సవం ఉంటుందని ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు.

క్లుప్తంగా

పేరూరు నుంచి తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

రామగిరి: మండలంలోని పేరూరులో మంగళవారం పలువురు భక్తులు పాదయాత్రగా తిరుమలకు బయలుదేరారు. 27మంది సభ్యులతో బయలుదేరి ఆరురోజులకు 280 కిలోమీటర్ల పాదయాత్ర అనంతరం తిరుమలకు చేరుకుంటామని పంచాంగం మోహన్‌దాస్, నాగరాజు, వెంకటరెడ్డి, రాజేష్, శ్రీనివాసులు, డ్యాంశేఖర్, బేగుల మాధవరాజు, రాచర్ల లవణ్ణ తదితరులు తెలిపారు. ఏటా తాము పాదయాత్రగా తిరుమలకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా స్పెషలాఫీసర్లు, నోడల్ అధికారులు, సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏవిధంగా సాగుతోందని ఆరా తీశారు. పురోగతి కోసం సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. నిర్దేశిత సమయంలోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

రిజిస్ట్రేషన్లపై ఆరా

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అదనపు కమిషనర్ శ్రీహరిబాబు ఆరా తీశారు. మంగళవారం నగరంలోని 29, 35, 38, 40,41, 45,46,54,55 సచివాలయాలను అదనపు కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వర్ బాగా పని చేస్తుందని, ఆ సమయంలో అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ అడ్మిన్లు, వీఆర్‌ఓలు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



లక్ష్మీదేవికి చెక్కు అందజేస్తున్న మేనేజర్ చంద్రశేఖర్

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామానికి చెందిన ఎగ్గిడి మల్లికార్జున కొద్ది రోజుల క్రితం గుండె పోటుతో మృతిచెందాడు. మల్లికార్జున ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఇన్సూరెన్స్ చేసి ఉండటంతో మంగళవారం మేనేజర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మృతుడి భార్య లక్ష్మీదేవికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన బీమా పథకం కింద రూ.2 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది నాగేంద్ర ప్రసాద్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న టైపిస్టు

పుట్టపర్తి రూరల్: తనకు దొరికిన పర్సును బాధితుడికి అప్పగించి టైపిస్టు మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం ఫస్ట్ క్లాస్ ఏడీజే కోర్టులో నాగప్ప టైపిస్ట్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం బస్సులో ధర్మవరం వరకు ప్రయాణం చేశారు. తన సీటు కింద పడి ఉన్న పర్సును గమనించి ఎవరిదని అక్కడున్న వారిని విచారించారు. తమది కాదని అందరూ తెలపడంతో.. పర్సులోని విజిటింగ్ కార్డు నంబర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. ఒడిషా రాష్ట్రం నుంచి పుట్టపర్తికి వలస వచ్చిన దినసరి కార్మికుడు సుదర్శన్ బందహర్ అనే వ్యక్తికి చెందిన పర్సుగా నిర్ధారించుకున్నాడు. అనంతరం అతడిని పిలిపించి పర్సులోని రూ.5వేల నగదు, ఏటీఎం, పాన్, ఓటరు కార్డును టైపిస్టు అందజేశారు.

అనంత స్వచ్ఛంద సంస్థల ఔదార్యం



ఆటోడ్రైవర్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: నగరంలోని జేఎన్‌టీయూ రోడ్డు వద్ద తీవ్రంగా గాయపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటోడ్రైవర్ రఫీకి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఔదార్యం చాటుకున్నారు. మంగళవారం బాధితుడికి రూ.71 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆర్థికసాయం అందించిన వారిలో లాల్ బాషా, నిరంజన్, శ్రీదేవి, సుజాత, స్వప్న, బాలకృష్ణ, చంద్ర, అమర్, రంజిత్ తదితరులు ఉన్నారు.



నీటి కోసం కుళాయి వద్ద వానరాల పోట్లాట





చెరువుకట్ట వద్ద ద్విచక్ర వాహనంపై ఉన్న పండ్లు తీసుకువెళ్లి తింటున్న వానరాలు





ఔరా..వానరా!

వానరాలు ఏమి చేసినా వింతగానే కనిపిస్తుంది. పిల్లలు ఆటలాడినా..చిలిపిచేష్టలు చేసినా, పెద్ద వారిని ఆట పట్టించినా.. ఇలా ప్రతి సందర్భంలోనూ మనం వాటిని పోలుస్తూ వానరాలను గుర్తు చేసుకుంటాం.. అచ్చంగా అలాంటి సన్నివేశం అనంతపురం నగరంలోని చెరువు కట్టపై కనిపించింది. ఓ వైపు మిట్ట మధ్యాహ్నం.. మరోవైపు వేసవి ప్రారంభం కాకనే ఎండలు మండుతున్నాయి. దీంతో వానరాలు చెరువు కట్టపై ఉన్న కొళాయిల వద్ద దాహం తీర్చుకున్నాయి. ఆహారం కోసం వెంపర్లాడాయి. వింత చేష్టలతో అటుగా వెళ్తున్న వాహనదారులు, స్థానికులను ఆశ్చర్యానికి గురిచేశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

నేడు ఇంటింటికీ వైఎస్సార్ సీపీ

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 40వ డివిజన్‌లో బుధవారం ఉదయం 7.30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బళ్లారి బైపాస్ నడిమివంక నుంచి కార్యక్రమం మొదలవుతుందని, ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని సూచించారు.

నేడు మాతృభాషా దినోత్సవం

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు భాషా సంఘాల ప్రతినిధులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.భాషా పరిరక్షణ సమితి నేతృత్వంలో ఉదయం 10 గంటలకు తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేయనున్నట్లు తెలిపారు. భాషాభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని తెలుగు భాషా వికాస ఉద్యమం ప్రతినిధి డాక్టర్ జాగర్లపూడి శ్యామ సుందరశాస్త్రి కోరారు. తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగుతల్లికి నీరాజనం పేరిట కార్యక్రమం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ బి.నారాయణ, డాక్టర్ నగరూరు రసూల్ తెలిపారు. తెలుగు రక్షణ వేదిక, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి ప్రతినిధులు తెలుగు తల్లి కూడలి వద్ద భాషా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జూదరుల అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రోటరీక్లబ్ వెనుక ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న పట్టణానికి చెందిన అల్తాఫ్, అబ్దుల్, రవికుమార్, మహేష్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. జూదరుల నుంచి రూ.3,420 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పేదలకు వరం.. 'జగనన్న ఆరోగ్య సురక్ష'



రాప్తాడు మండలం బొమ్మేపర్తిలో మాట్లాడుతున్న వైద్యాధికారి శివ కృష్ణ



ఆత్మకూరు మండలం మదిగుబ్బలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని వైద్యాధికారి శివ కృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మేపర్తి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. అనంతరం దాదాపుగా 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, హెల్త్ సూపర్ వైజర్లు నరసింహరావు, అరుణమ్మ, పంచాయతీ కార్యదర్శి రామచంద్రా రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బలో మంగళవాం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మదిగుబ్బ, మదిగుబ్బ తండా గ్రామాల ప్రజలకు డాక్టర్ సబిహా సుల్తానా వైద్య పరీక్షలు చేసి చికిత్సలు అందించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న రాష్ట్రపతి అవార్డుగ్రహీత బీసాతి భరత్ తదితరులు

అనంతపురం కల్చరల్: యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌వైకే కార్యాలయంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్ నిర్వహించారు. వర్చువల్ విధానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాయలసీమ జిల్లాలైన అనంతపురం, వైఎస్సార్ కడప, నంద్యాల, సత్యసాయి, అన్నమయ్య, కర్నూలు, చిత్తూరు, తిరుపతి యువతీయువకులు పాల్గొన్నారు. ఆత్మనిర్భర భారత్, వికసిత భారత్, అంకురార్పణ నిర్మాణం,, రాజకీయాల్లో యువత, మహిళా సాధికారికత అంశాలపై విస్తృత చర్చాగోష్టి జరిగింది. మొత్తం 160 మంది పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ దేశాభివృద్ధి యువతతోనే సాధ్యమని, యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. ఎన్‌వైకే అధికారి శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బీసాతి భరత్, యువజనాధికారి మణికంఠ, జీవన్ కుమార్, డాక్టర్ ప్రణతి తదితరులు మాట్లాడారు. యూత్ ఫెస్టివల్‌లో ప్రతి ఏటా అనంత యువత ప్రతిభ కనపరుస్తూ అందరినీ ఆకట్టుకుంటోందన్నారు. అనంతరం 16 మంది యువతీయువకులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి వేడుకలు



పూజలందుకున్న నిలువెత్తు వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: నగరంలో భీష్మ ఏకాదశి పర్వదిన వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో కొలువైన నిలువెత్తు వేంకటేశ్వరుడికి ప్రత్యేక అలంకార సేవలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అరవింద్, దేవరాజ్ నేతృత్వంలో ప్రసాద వితరణ జరిగింది. స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తజనం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణంతో మార్మోగించారు. మేడా వేంకటేశ్వర్లు తదితరులు 70వ పర్యాయం విష్ణు సహస్ర నామకోటి పారాయణం చేయించారు. హౌసింగు బోర్డు, రామనగర్, శ్రీనివాసనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న న్యాయవాది రవీంద్రారెడ్డి

యల్లనూరు: మండలంలోని చింతకాయమంద గ్రామంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి కల్యాణం, అన్నదానం, వృషభరాజులచే రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. రాతి దూలం లాగుడు పోటీలను గ్రామపెద్ద కేశవరెడ్డి కుమారుడు న్యాయవాది రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ చెన్నకేశవస్వామి ఉత్సవి గ్రహానికి కల్యాణం వైభవంగా సాగింది. అనంతరం నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీల్లో తాడిపత్రి రమేష్‌బాబుకు చెందిన వృషభాలు ప్రథమ బహుమతి రూ.60 వేలు గెలుచుకున్నాయి. అలాగే పీఆర్ పల్లె శివకొట్టి వృషభాలు రెండో బహుమతి రూ.40 వేలు, పీఆర్‌పల్లె నాగయ్యకు చెందిన మూడో బహుమతి రూ.20 వేలు, పెద్దపొలమడ మల్లేశ్వరరెడ్డి ఎద్దులు నాలుగో బహుమతి రూ.15 వేలు, ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డి వృషభాలు ఐదో బహుమతి రూ.10 వేలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ భోగతి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుజిరీ దుకాణంలో అగ్ని ప్రమాదం

కుందుర్పి: మండల కేంద్రంలో నూరుల్లాకు చెందిన గుజిరీ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించి రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి, దుకాణంలోని మొత్తం గుజిరీ సరుకు కాలిపోయింది. స్పందించిన పోలీసులు, ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు నూరుల్లా కోరుతున్నాడు.

బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో మంగళవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో బైక్ నడుపుతున్న శ్రీకృష్ణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రాయల చెరువు నుంచి గుత్తికి అతడు బైక్‌లో వస్తుండగా రోడ్డుకు అడ్డంగా పంది వచ్చింది. పందిని తప్పించబోయి బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా శ్రీకల్కి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో అమ్మభగవాన్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డులో వెలసిన కల్కి ఆలయం ఎనిమిదో వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. లోక కల్యాణార్థం శ్రీఅమ్మ భగవాన్ చిత్రపటాలకు ప్రత్యేక పూజలు, పల్లకీసేవ, శ్రీపరంజ్యోతి శ్రీచక్రపూజ చేయించారు. అనంతరం 100 మంది మహిళలకు సామూహిక సీమంతం చేశారు.

తొండపాడు ఆలయ కమిటీ చైర్మన్‌గా పెద్ద నారాయణ



గుత్తిరూరల్: మండలంలోని తొండపాడులో ఈ నెల 26 వరకూ జరిగే బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల కమిటీ చైర్మన్‌గా పెద్ద నారాయణను నియమించినట్లు ఈఓ దేవదాసు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేవాదాయ శాఖ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పెద్ద నారాయణ, సభ్యులుగా మద్దిలేటి, వెంకటలక్ష్మి, తిరుపాలు, రంగప్ప, నాగమణి, వెంకటేష్, చిన్న రంగప్ప, లింగమ్మను నియమించారు. చైర్మన్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మృతి



జనార్దన్ (ఫైల్)

తాడిపత్రిటౌన్: పట్టణంలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కురుబ జనార్దన్ (41) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంగా ఉన్న ఆయన ఇంట్లో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు శింగనమల నియోజకవర్గంలోని పుట్లూరు మండలంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులున్నారు.

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు: అశ్వత్థంలో మాఘమాసం తొలి ఆదివారం తిరుణాల సందర్భంగా భక్తులు హుండీల్లో వేసిన కానుకలను మంగళవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ,ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం నేతృత్వంలో లెక్కించారు. తాత్కాలిక హుండీల నుంచి రూ.4,97,659, శాశ్వ హుండీల ద్వారా 2,79,944 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు , గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దాబా దగ్ధం

బెళుగుప్ప: మండల పరిధిలోని గుండ్లపల్లి వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న సతీష్ దాబా షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం అర్ధరాత్రి దగ్ధమైంది. బాధితుడు ఉప్పర రామాంజనేయులు తెలిపిన మేరకు.. అర్ధరాత్రి ఉన్నపళంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి దాబా మొత్తం వ్యాపించాయి. ఈ ప్రమాదంలో దాబాలోని నిత్యావసర సరుకులు, ఫర్నీచర్ కాలిబూడిదయ్యాయి. ఇటీవల బృందావనం మహిళా సంఘంలో కుమారుడు సతీష్ వివాహం కోసం అప్పుగా తెచ్చుకున్న రూ.2లక్షల నగదు కాలిపోయింది. దాబా కాలిపోవడంతో రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు. నక్కలపల్లి, గుండ్లపల్లి సర్పంచులు రామిరెడ్డి, పురుషోత్తంలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు

ఉరవకొండ: స్థానిక ఈశ్వరమ్మ ఆలయంలో భీష్మ ఏకాదశి వేడుకలను మంగళవారం నిర్వహించారు. బెస్త సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తిప్పయ్య మాట్లాడారు. కార్యక్రమంలో బెస్తసేవా సంఘం గౌరవ అధ్యక్షుడు రామన్న, మండల అధ్యక్షులు బెస్తహరి, రామాంజనేయులు, వెంకటేసులు, పట్టణ నాయకులు ఎర్రి, వీరేష్, సాయికృష్ణ, సర్వేష్, శ్రీనివాసులు, మురళి, ఫక్కీరప్ప, అనిల్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఈఎఫ్ నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆర్‌ఈఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి

అనంతపురం: రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్‌ఈఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి , రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య మంగళవారం ఆవిష్కరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవరాజు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సి. చింతన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి. నారాయణప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.ఆనంద్, ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఆర్‌ఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.మహేష్ నాయక్, సభ్యులు డాక్టర్ రాముడు, డాక్టర్ నాసీల నాగేంద్ర, మల్లయ్య, వరప్రసాద్, సాకే వెంకట రాయుడు, తిరుపాల్ పాల్గొన్నారు.